## హిట్ అండ్ రన్‌కు పదేండ్ల శిక్షా?

- రద్దు చేయండి లేదా తగ్గించండి
- దేశవ్యాప్తంగా ట్రక్ డ్రైవర్ల ఆందోళన

న్యూఢిల్లీ, జనవరి 1: హిట్ అండ్ రన్ కొత్త చట్టాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ట్రక్ డ్రైవర్లు సోమవారం మూడు రోజుల ధర్నాను ప్రారంభించారు. భారతీయ న్యాయ సంహిత-2023 క్రిమినల్ కోడ్ చట్టం ప్రకారం హిట్ అండ్ రన్ నేరానికి గరిష్ఠంగా పదేండ్ల జైలు శిక్ష విధించనున్నారు. గతంలో అమల్లో ఉన్న ఐపీసీ ప్రకారం ఈ శిక్ష గరిష్ఠంగా రెండేండ్లే. అయితే కావాలని ఎవరూ ప్రమాదాలు చేయరని.. పొగ మంచు వల్ల సరిగ్గా కనిపించకపోవడం లాంటి చాలా కారణాలు ప్రమాదాలకు కారణమవుతాయని ట్రక్ డ్రైవర్లు తెలిపారు. కొత్త చట్టం తమను నిరుత్సాహరుస్తున్నదని, ఉద్యోగాలపై భయం నెలకొల్పిందన్నారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలని లేదా శిక్షను తగ్గించాలని దేశవ్యాప్తంగా రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపారు. ఈ నిరసన ప్రదర్శనల వల్ల బస్టాపులతో పాటు చాలా చోట్ల ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యాయి. కొన్ని రాష్ట్రాల్లో ఈ ధర్నాలో ప్రైవేట్ బస్ డ్రైవర్లు, కొందరు ప్రభుత్వ డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు సైతం పాల్గొన్నారు.

## నడిరోడ్డుపై దళితురాలి మీద పోలీస్ లాఠీఛార్జి

### బీహార్‌లో అమానవీయ ఘటన



సీతామర్హి, జనవరి 1: నడిరోడ్డుపై ఒక దళిత మహిళను పోలీస్ అధికారి లాఠీతో చితకబాదిన ఘటన బీహార్‌లోని సీతామర్హిలో జరిగింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీస్ అధికారి తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. వీడియోలో ఉన్న పోలీస్ అధికారి రాజ్ కిశోర్ సింగ్ అని.. జరిగిన ఘటనలో అతడి తప్పు ఉందని తేలితే కఠిన చర్యలు తీసుకొంటామని సీతామర్హి ఎస్పీ మనోజ్ కుమార్ తివారీ సోమవారం వెల్లడించారు. మరో మహిళతో వీధిలో గొడవ పడినందుకు బాధితురాలిని రాజ్‌కిశోర్ సింగ్ కొట్టినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహ్‌జాద్ పూనావాలా స్పందిస్తూ బీహార్‌లో నేరగాళ్లు దర్జాగా తిరుగుతుంటే సామాన్యులపై పోలీసులు లాఠీ ఛార్జి చేస్తున్నారని విమర్శించారు.

## నోబెల్ గ్రహీత యూనస్‌కు ఆరు నెలల జైలు



ఢాకా: బంగ్లాదేశ్ ఆర్థికవేత్త, నోబెల్ గ్రహీత డాక్టర్ మహమ్మద్ యూనస్ (83)కు ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ కోర్టు సోమవారం తీర్పు చెప్పింది. ఆయన కార్మిక చట్టాలను ఉల్లంఘించినట్లు రుజువైందని తెలిపింది. అయితే ఆయన మద్దతుదారులు మాత్రం ఇదంతా రాజకీయ ప్రేరేపితమేనని ఆరోపిస్తున్నారు. పేదరికానికి వ్యతిరేకంగా చేసిన పోరాటానికి యూనస్ 2006లో నోబెల్ పురస్కారాన్ని పొందారు. 1983లో ఆయన గ్రామీణ బ్యాంకును స్థాపించారు. దీని ద్వారా స్వల్ప మొత్తాల్లో అప్పులు ఇచ్చారు. దీంతో బంగ్లాదేశ్‌కు మంచి పేరు వచ్చింది. ఆయన ఏర్పాటు చేసిన సంస్థల్లో గ్రామీణ టెలికం ఒకటి. ఈ కంపెనీకి ఆయన చైర్మన్. ఆయనతోపాటు ఆయన సహచరులు ముగ్గురు ఈ కంపెనీలో కార్మికుల కోసం సంక్షేమ నిధిని ఏర్పాటు చేయలేదని, వీరు కార్మిక చట్టాలను ఉల్లంఘించారని రుజువైనట్లు థర్డ్ లేబర్ కోర్టు తీర్పు చెప్పింది. వీరికి ఆరు నెలల సాధారణ జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి 227.82 డాలర్ల చొప్పున జరిమానా విధించింది. వీరందరికీ ఒక నెల పాటు బెయిలు మంజూరు చేసింది.

# చిగురుటాకులా వణికిన జపాన్

## కొత్త ఏడాది తొలిరోజు భయపెట్టిన భూకంపాలు

- రిక్టర్ స్కేల్‌పై 4కు పైగా తీవ్రతతో ప్రకంపనలు
- ఇషికావాలో కూలిన ఇండ్లు, ధ్వంసమైన రోడ్లు
- శిథిలాల కింద చిక్కుకొని పలువురు మృతి!
- భూకంపాలతో సునామీ హెచ్చరికలు జారీ
- పలు చోట్ల తీరాలను తాకిన సునామీ అలలు
- మరో వారం భూప్రకంపనలు ఉండొచ్చని హెచ్చరికలు

టోక్యో, జనవరి 1: నూతన సంవత్సరం మొదటి రోజున సంభవించిన వరుస భూకంపాలతో జపాన్ చిగురుటాకులా వణికిపోయింది. జపాన్ పశ్చిమ తీరంలోని ఇషికావా, సమీప ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం 4 గంటల తర్వాత రిక్టర్ స్కేల్‌పై 3.2 పైగా తీవ్రతతో కూడిన 50కి పైగా వరుస భూకంపాలు సంభవించాయి. వీటిలో ఒకదాని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.6గా నమోదైంది. భూకంపాల నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాల్లోని పలు చోట్ల రోడ్లు, భవనాలు దెబ్బతిన్నాయి. వాజిమా పట్టణంలో దాదాపు 30 భవనాలు కుప్పకూలాయి. పలు చోట్ల శిథిలాల కింద ప్రజలు చిక్కుకొన్నట్టు తెలుస్తున్నది. ఇద్దరు మరణించినట్టు వార్తలు వచ్చాయి. అయితే భూకంపాల వల్ల మొత్తం మరణాలు, క్షతగాత్రుల సంఖ్యపై మాత్రం పూర్తి స్పష్టత లేదు. వరుస భూకంపాల నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తమైంది. పలు ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు చేసిన అధికారులు.. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆదేశాలు జారీచేశారు. ఇషికావాకు అధిక స్థాయి సునామీ హెచ్చరికలు జారీచేసిన జపాన్ వాతావరణ సంస్థ.. హోన్షు, హొక్కాయిడో తదితర ప్రాంతాలకు తక్కువ స్థాయి సునామీ హెచ్చరికలు ఇచ్చింది. ఇషికావాలోని నోటో పట్టణ సముద్ర తీరంలో ముందు 'మేజర్ సునామీ' హెచ్చరిక చేశారు. అలలు 5 మీటర్ల ఎత్తుకు ఎగిసే అవకాశం ఉన్నదని, ప్రజలు వీలైనంత తర్వాత సమీపంలోని ఎత్తైన ప్రాంతాలకు వెళ్లాలని లేదా భవనాలపైకి చేరాలని జపనీస్ పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్ ఎన్‌హెచ్‌కే టీవీ హెచ్చరించింది. మేజర్ సునామీ హెచ్చరికను కొన్ని గంటల తర్వాత అధికారులు సాధారణ సునామీ హెచ్చరికకు తగ్గించారు. రాకాసి అలలు సంభవించే అవకాశం ఇప్పటికీ ఉన్నదని, ప్రస్తుతానికి ఇండ్లకు తిరిగి వెళ్లొద్దని తీర ప్రాంత వాసులకు సూచించారు.

### ఎగిసిపడిన సునామీ అలలు

సునామీ హెచ్చరికల తర్వాత ఇషికావాలోని నోటో తీరాన్ని 5 మీటర్ల వరకు ఎత్తున అలలు తాకాయి. నిగిటా, తొయామా తదితర ప్రాంతాల్లో మూడు మీటర్ల ఎత్తున అలలు ఎగిసిపడ్డాయని ఎన్‌హెచ్‌కే నివేదించింది. మరోవైపు వాజిమా పోర్టును 1.2 మీటర్ల ఎత్తున అలలు తాకగా.. పలు ఇతర ప్రాంతాల్లో కూడా చిన్నపాటి సునామీలు సంభవించాయి. కాగా, భూకంప ప్రాంతాల్లో ఉన్న అణు విద్యుత్తు ప్లాంట్లపై ప్రభావం పడలేదని, రేడియోయాక్టివ్ లీక్ రిస్క్ లేదని జపాన్ న్యూక్లియర్ రెగ్యులేటరీ అధికారులు పేర్కొన్నారు.



వరుస భూకంపాలు సంభవించడంతో ఒసాకాలో ఓ చోట గుమికూడి తలదాచుకున్న స్థానికులు

### హైవేల మూసివేత.. రైళ్ల రద్దు

భూకంపాల ధాటికి పలుచోట్ల ఇండ్లు ధ్వంసం అయ్యాయి. రోడ్లు, ఇతర నిర్మాణాలు దెబ్బతిన్నాయి. సుకు పట్టణంతో పాలు పలు ప్రాంతాల్లో పలువురు భవన శిథిలాల కింద చిక్కుకొన్నట్టు తెలుస్తున్నది. భూకంప కేంద్రానికి సమీపంలోని పలు ప్రధాన హైవేలను మూసివేశారు. ఇషికావా రీజియన్‌కు వెళ్లే హైస్పీడ్ రైలు సర్వీసులను అధికారులు రద్దు చేశారు. ఇషికావా, నిగాటాలలో ఫోన్, ఇంటర్నెట్ సర్వీసులకు అంతరాయం ఏర్పడిందని టెలికం సంస్థలు పేర్కొన్నాయి. 34 వేల ఇండ్లకు పైగా విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడిందని ప్రభుత్వ అధికార ప్రతినిధి హయాషి పేర్కొన్నారు. మరణాలు సంభవించినట్టు, ప్రజలు గాయపడినట్టు ఎలాంటి నివేదికలు లేవని, పరిస్థితి ఇంకా అస్పష్టంగా ఉన్నదన్నారు.

### వీధుల్లోకి పరుగుపెట్టిన ప్రజలు

వచ్చే వారంలో ప్రధానంగా 2-3 రోజుల్లో మరిన్ని భూకంపాలు సంభవించే అవకాశం ఉన్నదని జపాన్ వాతావరణ సంస్థ హెచ్చరించింది. తాజా భూకంపాల నేపథ్యంలో జపాన్ సైన్యం సహాయక చర్యలు చేపట్టింది. వాజిమా పట్టణంలోని ఒక నివాస భవనంలో మంటలు చెలరేగాయి. వరుస భూకంపాలతో భయాందోళనలతో ప్రజలు వీధుల్లో పరిగెడుతున్న దృశ్యాలను స్థానిక మీడియా సంస్థలు ప్రసారం చేశాయి. కాగా, జపాన్‌లో తరుచుగా భూకంపాలు సంభవిస్తూ ఉంటాయి. గత ఏడాది మేలో రిక్టర్ స్కేల్‌పై 6.5 తీవ్రతతో భూకంపం వచ్చింది. అప్పుడు కూడా భూకంప కేంద్రం ఇషికావా రీజియన్‌లోనే ఉన్నది.

### అప్రమత్తమైన సమీప దేశాలు

జపాన్‌లో వరుస భూకంపాల నేపథ్యంలో సమీప దేశాలు అప్రమత్తమయ్యాయి. షకాలిన్ ద్వీపానికి రష్యా అధికారులు సునామీ హెచ్చరికలు జారీచేశారు. షకాలిన్ పశ్చిమ తీర ఏరియాలను పెద్ద అలలు తాకే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. దక్షిణ కొరియాలో తూర్పు తీర పట్టణాల్లో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సముద్రపు మట్టం స్థాయిల్లో మార్పులను గమనిస్తూ ఉండాలని స్థానిక వాతావరణ సంస్థ సూచించింది.

### భారత రాయబార కార్యాలయంలో కంట్రోల్ రూమ్

జపాన్‌లో భూకంప తీవ్రత కారణంగా సునామీ హెచ్చరికలు జారీచేసిన నేపథ్యంలో టోక్యోలోని రాయబార కార్యాలయంలో భారత్ ఎమర్జెన్సీ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. భారతీయులకు తగిన సమాచారంతో కూడిన సాయం అందించేందుకు రాయబార కార్యాలయ సిబ్బంది ఫోన్ నంబర్లు, మెయిల్ ఐడీలతో ఒక ప్రకటన విడుదల చేసింది. భూకంపం, సునామీ హెచ్చరికలకు సంబంధించిన సమాచారం కోసం ఎవరైనా సంప్రదించవచ్చునని తెలిపింది. స్థానిక అధికారుల సూచనలు పాటించాలని ప్రకటనలో సూచించింది.

## బ్రిటన్ స్టూడెంట్ వీసా నిబంధనలు కఠినతరం

- కుటుంబ సభ్యుల రాకపై నిషేధం!

లండన్, జనవరి 1: భారత్ సహా అంతర్జాతీయ విద్యార్థులకు బ్రిటన్ ప్రభుత్వం షాక్ ఇచ్చింది. విద్యార్థుల కుటుంబ సభ్యుల రాకపై నిషేధం విధిస్తూ నిబంధనల్ని ప్రభుత్వం కఠినతరం చేసింది. అంతేగాక పోస్ట్ స్టడీ వర్క్ వీసా (గ్రాడ్యుయేట్ రూట్) పైనా బ్రిటన్ సమీక్ష చేయబోతున్నది. వలస విధానంపై బ్రిటన్ ప్రభుత్వ నిర్ణయాలు భారతీయ విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. స్టూడెంట్ వీసా కొత్త నిబంధనలు సోమవారం నుంచి అమల్లోకి వస్తున్నాయని బ్రిటన్ హోం శాఖ తాజాగా వెల్లడించింది. పోస్ట్‌గ్రాడ్యుయేట్ రిసెర్చ్, ప్రభుత్వ స్కాలర్‌షిప్ కింద కోర్సులు చేస్తున్న విద్యార్థులకు మాత్రం కొత్త నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చారు.

## బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలపై దాడి చేస్తాం: పన్నూ

న్యూఢిల్లీ, జనవరి 1: విదేశాల్లో ఉంటూ భారత్‌ను బెదిరిస్తున్న ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ మరోసారి రెచ్చిపోయాడు. భారత దేశాన్ని ఆర్థికంగా దెబ్బతీస్తానని, మార్చి 12 నుంచి బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ)లపై దాడి చేస్తానని బెదిరించాడు. ఇండియన్ స్టాక్స్‌ను వదిలిపెట్టి, మార్చి 12లోగా అమెరికన్ స్టాక్స్‌ను కొనాలని పిలుపునిచ్చాడు. ముంబైలో వరుస పేలుళ్లు జరిగి మార్చి 12 నాటికి 31 సంవత్సరాలు అవుతుందనే విషయం తెలిసిందే.

## గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్ ఉగ్రవాది: కేంద్రం

న్యూఢిల్లీ: కెనడాలో ఆశ్రయం పొందుతున్న గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్‌ను కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదిగా ప్రకటించింది. మోస్ట్ వాంటెడ్ జాబితాలో చేర్చింది. నిషేధిత ఖలిస్థానీ సంస్థ బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్‌తో కలిసి అతడు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు తేలింది. ఉగ్రవాదులు దేశంలో చొరబడటానికి సహకారం అందించడంతో పాటు హత్య కేసుల్లోనూ ప్రమేయం ఉన్నదని హోంశాఖ వెల్లడించింది.

# నయా సాల్.. నయా జోష్

చిత్రం

వెండితెరపై తారాడే అందమైన అనుభూతుల వర్ణ చిత్రంలా గత ఏడాది కాలయవనికపై నుంచి మెల్లగా జారిపోయింది. నిరుడు తెలుగు సినిమాకు బాగా కలిసొచ్చింది. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై టాలీవుడ్ కీర్తిపతాక రెపరెపలాడింది. ఈ నేపథ్యంలో ద్విగుణీకృతమైన ఉత్సాహంతో నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టింది. మరికొద్ది రోజుల్లో సంక్రాంతి సంరంభానికి తెరలేవనుంది. ఈ సందర్భంగా నయా సాల్‌కు స్వాగతం పలుకుతూ అభిమానుల్లో జోష్‌ను నింపుతూ భారీ చిత్రాల తాజా అప్‌డేట్స్ వెలువడ్డాయి. కొత్త పోస్టర్స్ కళకళలాడాయి. వాటి విశేషాలేమిటో ఓసారి చూద్దాం..



'దేవర'లో ఎన్టీఆర్

### 'దేవర'..8న గ్లింప్స్

ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర' శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. ఇప్పటికే 80శాతం చిత్రీకరణ పూర్తయింది. జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తున్నది. ఈ సినిమా రెండు భాగాలుగా రిలీజ్ కానుంది. తొలి భాగం ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకురానుంది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఎన్టీఆర్ కొత్త లుక్‌ను విడుదల చేశారు. ఇందులో బోటుపై నిల్చొని ఉగ్రరూపంలో కనిపిస్తున్నారాయన. ఈ సినిమా గ్లింప్స్‌ను ఈ నెల 8న విడుదల చేయబోతున్నట్లు నిర్మాతలు తెలిపారు. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ సంస్థలు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

### 'సైంధవ్'..ట్రైలర్ సిద్ధం

అగ్ర హీరో వెంకటేష్ నటిస్తున్న 75వ చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకుడు. సంక్రాంతి కానుకగా ఈ నెల 13న విడుదల కానుంది. తండ్రీకూతుళ్ల సెంటిమెంట్ ప్రధానంగా యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ట్రైలర్‌ను ఈ నెల 3న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో వెంకటేష్, బేబీ సారా చిరునవ్వులు చిందిస్తూ కనిపిస్తున్నారు. ఈ పాన్ ఇండియా చిత్రాన్ని నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై వెంకట్ బోయనపల్లి నిర్మించారు.



సైంధవ్



ఈగల్

### యాక్షన్ థ్రిల్లర్ 'ఈగల్'

రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. టీజీ విశ్వప్రసాద్ నిర్మాత. ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకురానుంది. న్యూ ఇయర్‌ను పురస్కరించుకొని కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో రవితేజ స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. ప్రేక్షకులకు ఆద్యంతం థ్రిల్‌ను కలిగించే కథాంశమిదని, రవితేజ పాత్ర నవ్యరీతిలో సాగుతుందని చిత్ర బృందం తెలిపింది. అనుపమ పరమేశ్వరన్, నవదీప్, శ్రీనివాస్ అవసరాల, మధుబాల తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కార్తీక్ ఘట్టమనేని, కమిల్ ప్లాకి, కర్మ్ చావ్లా, సంగీతం: డేవ్ జాంద్, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, ఎడిటింగ్, దర్శకత్వం: కార్తీక్ ఘట్టమనేని.



భీమా



గీతాంజలి మళ్లీ వచ్చింది

### గీతాంజలి మళ్లీ వస్తున్నది..


అంజలి కథానాయికగా నటిస్తున్న 50వ చిత్రం 'గీతాంజలి మళ్లీ వచ్చింది..'. హారర్ కామెడీ కథాంశంతో తెరకెక్కిస్తున్నారు. మలయాళ నటుడు రాహుల్ మాధవ్ టాలీవుడ్‌కు పరిచయమవుతున్నాడు. 'గీతాంజలి' సినిమాకు సీక్వెల్ ఇది. ప్రస్తుతం షూటింగ్ జరుగుతున్నది. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ సోమవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో పాడుబడ్డ భవంతిలో నాట్య కళాకారిణి లుక్‌లో అంజలి కనిపిస్తున్నది. పాన్ ఇండియా స్థాయిలో విడుదల కాబోతున్న ఈ చిత్రానికి నిర్మాతలు: ఎంవీవీ సత్యనారాయణ, జీవీ, దర్శకత్వం: శివ తుర్లపాటి.

### పోలీస్ పవర్ 'భీమా'

గోపీచంద్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'భీమా'. ఏ.హర్ష దర్శకత్వంలో శ్రీసత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ కథానాయికలు. సోమవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో హీరో గోపీచంద్ ఖాకీ దుస్తుల్లో ఫెరోసియస్‌గా కనిపిస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'సాంకేతికంగా ఉన్నత ప్రమాణాలతో తెరకెక్కిస్తున్నాం. పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా గోపీచంద్ పాత్ర మునుపెన్నడూ చూడని రీతిలో ఉంటుంది' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: స్వామి జె గౌడ, సంగీతం: రవి బస్రూర్, సంభాషణలు: అజ్జు మహంకాళి, దర్శకత్వం: ఏ. హర్ష.

## మార్చిలో ముహూర్తం?

**మహేష్‌బాబు** తాజా చిత్రం 'గుంటూరు కారం' సంక్రాంతి కానుకగా ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నది. ఈ సినిమా తర్వాత ఆయన రాజమౌళి దర్శకత్వంలో నటించబోతున్న విషయం తెలిసిందే. ఆఫ్రికా అడవుల నేపథ్యంలో యూనివర్సల్ అడ్వెంచర్ కథాంశంతో దర్శకుడు రాజమౌళి ఈ సినిమాకు సన్నాహాలు చేస్తున్నారు. పాన్ వరల్డ్ సినిమాగా..హాలీవుడ్ సాంకేతిక నిపుణులను భాగస్వామ్యం చేస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. రాజమౌళి తండ్రి, రచయిత విజయేంద్ర ప్రసాద్ కథనందిస్తున్నారు. ప్రస్తుతం పూర్వ నిర్మాణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సినిమా ఎప్పుడు సెట్స్‌మీదకు వెళ్తుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం మార్చిలో పూజా కార్యక్రమాలతో ఈ సినిమాను లాంఛనంగా ప్రారంభించబోతున్నారని తెలిసింది.



రాజమౌళి



మహేష్‌బాబు

## అదొక జీవితకాల అవకాశం



యువ హీరో నాగచైతన్య ప్రస్తుతం పాన్ ఇండియా చిత్రం 'తండేల్'లో నటిస్తున్న విషయం తెలిసిందే. చందు మొండేటి దర్శకుడు. మత్స్యకారుల జీవితాల నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా గురించి నాగచైతన్య ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. '2018లో జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. అంతర్లీనంగా ప్రేమకథ కూడా ఉంటుంది. వ్యవస్థలోని అక్రమాలను, రాజకీయాలను ప్రశ్నిస్తుంది. ఈ తరహా పాత్రలు జీవితకాలంలో ఒక్కసారి మాత్రమే లభిస్తాయి. ఈ సినిమా కోసం నన్ను నేను తీర్చిదిద్దుకున్నా. ఈ సినిమా గురించి నాన్నతో చాలా సార్లు చర్చించాను. ఆయన నాకెప్పుడూ మంచి సలహాలిస్తుంటారు. క్రియేటివ్‌గా ఆలోచించాలని చెబుతుంటారు. విమర్శలు వచ్చినప్పుడు వాటిని ఎలా ఎదుర్కోవాలో చెబుతాడు' అని నాగచైతన్య అన్నారు. 'తండేల్' షూటింగ్ ఇటీవలే ప్రారంభమైంది.



రకుల్‌ప్రీత్‌సింగ్

## పెళ్లికి వేళయింది..

*పంజాబీ భామ రకుల్‌ప్రీత్‌సింగ్ పెళ్లి వార్తలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. బాలీవుడ్ నిర్మాత జాకీ భగ్నానీతో ఈ అమ్మడు గత మూడేళ్లుగా ప్రేమాయణం సాగిస్తున్నది. వీరిద్దరు కలిసి పలు ప్రైవేట్ పార్టీలకు హాజరైన ఫొటోలు సోషల్ మీడియాలో దర్శనమిచ్చాయి. గతంలో పెళ్లి గురించి అడిగినప్పుడు సమయం వచ్చినప్పుడు తప్పకుండా చేసుకుంటానని బదులిచ్చింది రకుల్‌ప్రీత్‌సింగ్. తాజా సమాచారం ప్రకారం ఫిబ్రవరి 22న గోవాలో ఈ జంట పెళ్లిపీటలెక్కబోతున్నట్లు తెలిసింది. అక్కడ ఓ ప్రముఖ రిసార్ట్‌లో వీరి వివాహం జరగనుందని సమాచారం. ఇరు కుటుంబ సభ్యులతో పాటు బాలీవుడ్ సన్నిహితుల సమక్షంలో వైభవంగా పెళ్లికి సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది. గత కొంతకాలంగా తెలుగు చిత్రసీమకు దూరంగా ఉంటున్న రకుల్‌ప్రీత్‌సింగ్..బాలీవుడ్‌లో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నది. 'కొండపొలం' తర్వాత మరే తెలుగు చిత్రంలో నటించలేదు రకుల్‌ప్రీత్‌సింగ్. తమిళంతో పాటు బాలీవుడ్‌లో మాత్రం చక్కటి అవకాశాలతో దూసుకుపోతున్నది.*